# హస్తవ్యస్థంగానే..

## కాంగ్రెస్‌లో తెగని టికెట్ల లొల్లి

- మా నాయకుడికే ఇవ్వాలంటూ అనుచరుల హంగామా..
- ఐక్యతారాగం అంటూనే బయటపడుతున్న వర్గ విభేదాలు
- సిపిఐకి కేటాయిస్తున్నారంటూ ప్రచారం అవుతుండడంతో బహిర్గతం
- కాంగ్రెస్‌కు కేటాయించాలని అంబేద్కర్ విగ్రహం ఎదుట పోట్ల వర్గీయుల నిరసన
- ఎడవల్లికి కేటాయించాలని సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్
- పొంగులేటి పోటీ చేయాలని పెట్రోల్ పోసుకున్న యువకులు
- కొత్తగూడెం కాంగ్రెస్ రాజకీయాల్లో రాచుకుంటున్న టికెట్ల వేడి
- ఎన్నికల నాటికి సర్దుమణిగేనా..!? మరింత పెరిగేనా..!?




కొత్తగూడెం అక్టోబర్16(కెరటం ప్రతినిధి)

**కొత్తగూడెం రాజకీయాలు రోజురోజుకి మరింత వేడి రాచుకుంటున్నాయి.** ఓ పక్క బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా వనమా వెంకటేశ్వరరావును ప్రకటించడంతో పాటు తాజాగా బీఫామ్‌ను సైతం అందజేసి ఆ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ఎన్నికల సమర శంఖాన్ని పూరించారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం అభ్యర్థి ఎవరనే అంశంపైనే నేటికీ మల్లగుల్లాలుపడుతోంది. తమకంటే తమకే అనుకుని నియోజకవర్గాల్లో ప్రచారం చేసుకున్న ఆశావాహులు పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయిస్తున్నారంటూ విస్తృత ప్రచారం జరుగుతుండడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఎలాగైనా కాంగ్రెస్ పార్టీకే కేటాయించాలంటూ అధిష్టానాన్ని పట్టుబడుతున్నారు. తామంతా ఐక్యంగానే ఉన్నాం.. పార్టీ నిర్ణయమే మాకు అంతిమం అంటూ ఇటీవల ఐక్యతారాగం పాడుకున్న కాంగ్రెస్ నాయకులు తమ నాయకుడికే టికెట్ ఇవ్వాలంటూ ఆశావాహుల అనుచరులు నిరసనలు వ్యక్తం చేస్తుడడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పొంగులేటి కొత్తగూడెంలో పోటీ చేయాలని ఓ యువకుడు ఇటీవల పెట్రోల్ పోసుకోగా.. ఎడవల్లికి టికెట్ కేటాయించాలని సోమవారం సాయంత్రం సెల్ టవర్ ఎక్కి ఎడవల్లి అభిమాని నిరసన తెలిపాడు. అంతేకాదు కొత్తగూడెం టికెట్ కాంగ్రెస్‌కే కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ, టిపిసిసి ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరరావు ఫ్లకార్డులు పట్టుకుని పోట్ల వర్గీయులు నిరసన తెలిపారు. ఇలా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా నిరసనలు తెలియజేస్తుడడం.. పొత్తులో సీపీఐకే టికెట్ వెళుతుందని ప్రచారం జరుగుతుండడంతో అటు కాంగ్రెస్ కార్యకర్తల్లోనూ ఇటు సీపీఐ కార్యకర్తలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

**కాంగ్రెస్‌కే ఇవ్వాలంటూ పోట్ల వర్గీయుల నిరసన**

కొత్తగూడెం అసెంబ్లీ బరిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరున్నా గెలుపు పక్కా అని అన్ని సర్వేలలో స్పష్టంగా ఉన్నపటికీ పొత్తుల పేరిట టికెట్ సిపిఐ కి ఇస్తామనడం సరైంది కాదంటూ టీపీసీసీ ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరావు వర్గీయులు జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. నిన్న మొన్నటి వరకు తమ పార్టీ అభ్యర్థి నిలుచుంటే భారీ మెజారిటీ దక్కుతుందని అనుకున్నామని కానీ కొత్తగూడెం కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలకు విలువ ఇవ్వకుండా టికెట్ సిపిఐకు ఇస్తామంటే రేపటి నుండి బయట ఎలా తిరగాలని ప్రశ్నిస్తున్నారు. తామొకటి తలిస్తే అధిష్టానం మరొకటి తలించి గెలుపు సాధించే స్థానాన్ని కామ్రేడ్‌లతో పొత్తు పేరుతో నియోజక వర్గాన్ని ఇవ్వడాన్ని ఒప్పుకోబోమన్నారు. జనరల్ స్థానమైన కొత్తగూడెం నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా సిపిఐ పార్టీకి కేటాయించడం అంటే ఓటమిని ఒప్పుకున్నట్టే అంటూ పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమయం మించి పోలేదని రెండవ లిస్ట్ లో ఎట్టి పరిస్థితుల్లో కొత్తగూడెం టికెట్ కాంగ్రెస్ కే కట్టబెట్టాలని.. కామ్రేడ్లు బలంగా ఉన్న నియోజక వర్గాల్లో సిపిఐకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరునూరైనా కొత్తగూడెంను పొత్తులో వదులుకునే ప్రసక్తే లేదని ఖరాఖండిగా అన్నారు.

**ఎడవల్లికి కేటాయించాలని సెల్ టవర్ ఎక్కిన యువకుడు**

సీపీఐకి కాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణకు కొత్తగూడెం టికెట్‌ను కేటాయించాలని సోమవారం సాయంత్రం ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. రామవరం ప్రాంతానికి రాజేంద్రకుమార్ లోథ్ అనే యువకుడు పోస్టాఫీసు సెంటర్‌లోని సెల్‌టవర్ ఎక్కి హంగామా చేశాడు. ఎడవల్లికే టికెట్ కేటాయించాలని లేకుంటే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడబోనని తెలిపాడు. దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న వన్ టౌన్ సీఐ కరుణాకర్ యువకుడితో మాట్లాడి కిందకి దింపే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఎడవల్లి అనుచరులు రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లిఖార్జున్, నూకల రంగా రావు, ఏలూరి రాజేష్ తదితరులు రాజేంద్రకుమార్‌తో మాట్లాడి ఎడవల్లికే టికెట్ వస్తుందని.. అధైర్యపడాల్సిన అవసరం లేదని బుజ్జగించడంతో ఎట్టకేలకూ కిందకు దిగాడు. అతన్ని వెంటనే వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**పొంగులేటి పోటీ చేయాలని పెట్రోల్ పోసుకున్న యువకులు**

కొత్తగూడెం నుంచి కాకుండా పాలేరు నియోజకవర్గం నుంచి ఖమ్మం మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటీ చేస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతుండడంతో ఓ అభిమాని ఖమ్మంలోని పొంగులేటి క్యాంప్ ఆఫీసులో పెట్రోల్ పోసుకుని హైటెన్షన్‌కు గురిచేశాడు. కొత్తగూడెం నుండి పోటీ చేయాలని ప్రసాద్, నవీన్ అనే ఇద్దరు యువకులు ఆత్మాహుతికి పాల్పడ్డారు. వెంటనే ఇద్దరి యువకులను పొంగులేటి వద్దకు తీసుకెళ్లి వారిని సముదాయించారు. కాంగ్రెస్ టికెట్ ఖచ్చితంగా పొంగులేటికే ఇవ్వాలని.. లేకుంటే ప్రాణాలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని వెల్లడించారు. ఈ ఘటనకు పాల్పడడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఎన్నికల నాటికి సర్దుమణిగేనా..!? మరింత పెరిగేనా..!?**

కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ టికెట్ కావాలంటూ దాదాపు 10 మంది వరకు అధినాయకత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ నాయకులతో పాటు వారి అనుచరగణం అంతా ఇటీవల తామంతా ఒక్కటే అన్న ఆలోచన కార్యకర్తల్లో తీసుకురావాలని ప్రయత్నం చేశారు. కానీ ఎన్నికల సమయం మరింత దగ్గరకు వస్తున్న తరుణంలో వారి మధ్య ఉన్న విభేదాలు రాచుకుంటూనే ఉన్నాయి. సీపీఐ పార్టీకి కనుక టికెట్ కేటాయిస్తే పార్టీలో కొంతమంది రాజీనామాలకు సైతం వెనుకాడబోమన్న సంకేతాలు హైకమాండ్‌కు పంపుతున్నారు. కాంగ్రెస్ టికెట్ కూడా తమ నాయకుడికే కావాలని కూడా ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఈ విబేధాలు ఓ కొలిక్కి వచ్చి ఎన్నికల నాటికి సర్దుమణుగుతాయా..లేక మరింత పెరుగుతాయా అన్నది వేచి చూడాలి...!!

### కాక రేపుతున్న సీపీఐ పొత్తు..!

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి విడిపోయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా ఏర్పడిన తర్వాత కొత్తగూడెం నియోజకవర్గానికి 10సార్లు, పాల్వంచ నియోజకవర్గంగా ఉన్న సమయంలో 4 సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే 1957 నుంచి 1972 వరకు పాల్వంచ నియోజకవర్గంగా ఉన్న తరుణంలో జరిగిన 4సార్లు ఎన్నికల్లో మూడు సార్లు కూడా కాంగ్రెస్ పార్టీనే గెలిచింది. ఒక సారి మాత్రమే సీపీఐ గెలిచింది. అయితే 1972లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో పాల్వంచ కాస్తా కొత్తగూడెం అసెంబ్లీ స్థానంగా మారింది. అయితే ఇక కొత్తగూడెం నియోజక వర్గంగా ఉన్న సమయంలో 1978 నుంచి 2018 వరకు 10 సార్లు ఎన్నికలు జరగ్గా.. నాలుగు సార్లు కాంగ్రెస్, రెండు సార్లు టిడిపి, సీపీఐ రెండు సార్లు, జనతా పార్టీ, టిఆర్ఎస్ పార్టీ ఒక్కొక్కసారి విజయం సాధించాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని కాదని ఇప్పుడు సీపీఐకి టికెట్ కేటాయిస్తున్నారంటూ ప్రచారం జరుగుతుండడంతో కొత్తగూడెం రాజకీయాలు కాక రేపుతున్నాయి. గెలిచే సీటును చేజేతులారా బీఆర్ఎస్ పార్టీకి అప్పగించి నట్టేనని.. కాంగ్రెస్ పార్టీకి ఇస్తే సునాయాసంగా గెలుస్తుందన్న దీమా కాంగ్రెస్ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

## రేవంత్‌రెడ్డిని కలిసిన బార్ ప్రతినిధులు

కొత్తగూడెం అక్టోబర్16(కెరటం ప్రతినిధి)

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయవాదుల సమస్యలను తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని కోరుతూ అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ప్రధాన బాధ్యులను కలిసి వినతి పత్రం సమర్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డిని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ బార్ అసోసియేషన్ల రాష్ట్ర నాయకత్వం కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. ఇటీవల కాలంలో న్యాయవాదులపై విపరీతంగా పెరిగిన భౌతిక దాడులను అరికట్టడం కోసం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నుండి ప్రతి ఈటా ఇస్తున్నబిఆరోగ్య బీమా కవరేజీని ప్రస్తుతం ఉన్న రెండు లక్షల రూపాయల నుండి పది లక్షల రూపాయలు పెంచాలని, రాష్ట్రంలోని యువ న్యాయవాదులకు బీమా కవరేజీని విస్తరింపచేయలని, అయిదు సంవత్సరాల కంటే తక్కువ స్టాండింగ్ ఉన్న యువ న్యాయవాదులకు ప్రతి నెల పదివేల రూపాయలు స్టైపెండ్ అందించి కారు వృత్తిలో నిలబడేలా చర్యలు తీసుకోవాలని, అవసరమున్న పేద న్యాయవాదులకు ఇళ్ల స్థలం లేదా డబుల్ బెడ్రమ్ కేటాయించాలని, న్యాయవాదుల సంక్షేమానికి 500 కోట్లు మంజూరు చేయాలని, తెలంగాణాలో 41ఏ సి.ఆర్.పి.సి.ని సవరించాలని, ఈ సమస్యలను ఎన్నికల ప్రణాళికలో పొందు పరచాలని విజ్ఞప్తి చేశారు. అందుకు రేవంత్ రెడ్డి స్పందిస్తూ, ఈ వినతి పత్రాన్ని మేనిఫెస్టో కమిటీ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పంపిస్తానని హామీ ఇచ్చారు.



ఆదివారం నాడు ఫెడరేషన్ ప్రతినిధులకేంద్ర మంత్రి, బి.జె.పి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కూడా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ ల ఫెడరేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ (నాంపల్లి), వర్కింగ్ ప్రెసిడెంట్ ధీకొండ రవీందర్ (రంగారెడ్డి), ప్రధాన కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి (మేడ్చల్ మల్కాజిగిరి), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్ (కొత్తగూడెం) తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం టికెట్ కాంగ్రెస్‌కే ఇవ్వాలి

## అంబేద్కర్ విగ్రహం ఎదుట పొట్ల నాగేశ్వరరావు వర్గీయుల నిరసన

**కొత్తగూడెం, అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం అసెంబ్లీ బరిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరున్నా గెలుపు పక్కా అని అన్ని సర్వేలలో స్పష్టంగా ఉన్నపటికీ పొత్తుల పేరిట టికెట్ సిపిఐకి ఇస్తామనడం సరైంది కాదంటూ టీపీసీసీ ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరావు వర్గీయులు జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. నిన్న మొన్నటి వరకు తమ పార్టీ అభ్యర్థి నిలుచుంటే భారీ మెజారిటీ దక్కుతుందని అనుకున్నామని కానీ కొత్తగూడెం కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలకు విలువ ఇవ్వకుండా టికెట్ సిపిఐ కు ఇస్తామంటే రేపటి నుండి బయట ఎలా తిరగాలని ప్రశ్నిస్తున్నారు. తామొకటి తలిస్తే అధిష్టానం మరొకటి తలించి గెలుపు సాధించే స్థానాన్ని కామ్రేడ్‌లతో పొత్తు పేరుతో నియోజక వర్గాన్ని ఇవ్వడాన్ని ఒప్పుకోబోమన్నారు. జనరల్ స్థానమైన కొత్తగూడెం నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా సిపిఐ పార్టీకి కేటాయించాడం అంటే ఓటమిని ఒప్పుకున్నట్టే అంటూ పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమయం మించి పోలేదని రెండవ లిస్ట్ లో ఎట్టి పరిస్థితుల్లో



కొత్తగూడెం టికెట్ కాంగ్రెస్ కే కట్టబెట్టాలని.. కామ్రేడ్లు బలంగా ఉన్న నియోజక వర్గాల్లో సిపిఐకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరునూరైనా కొత్తగూడెంను పొత్తులో వదులుకునే ప్రసక్తే లేదని ఖరాఖండిగా అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మరియు రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి, పినపాక ఎల్డీఎం కార్డినేటర్ మోతుకూరి ధర్మారావు, జిల్లా ఓబీసీ చైర్మన్ అల్లాడి నరసింహారావు, గరీబ్‌పేట ఎంపీటీసీ కసనబోయిన భద్రం, కొత్తగూడెం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్, కొత్తగూడెం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్, సీనియర్ నాయకులు కృష్ణ,హరి సింగ్, శివ, రాందాస్, బీరెల్లి భద్రం, సైదులు, గాండ్ల సురేష్, కాపా శీను, అరిగే గోపి, యూత్ కాంగ్రెస్ నాయకులు బట్టు మురళి, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ ఉస్మాన్, పాల్వంచ టౌన్ ప్రెసిడెంట్ హెచ్ మధు, పాల్వంచ మండల ప్రెసిడెంట్ భూక్యా గిరి ప్రసాద్, లక్ష్మీదేవిపల్లి మండల ప్రెసిడెంట్ అరుణ్, సాయి, కోటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.






## ఈ నెల 19న ఫ్యామిలీ డే వేడుకలు

### పనులను సమీక్షించిన ఏరియా ఎస్ఓటు జిఎం జీవి కోటిరెడ్డి

**సింగరేణి, అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు ఆదేశానుసారం ఈ నెల 19న కొత్తగూడెం ఏరియాలోని ప్రగతి వనం నందు ఫ్యామిలీ డే, బతుకమ్మ సెలబ్రేషన్స్ నిర్వహించడం జరుగుతున్నందున సోమవారం కొత్తగూడెం ఏరియా ఎస్ఓటు జిఎం జివి కోటిరెడ్డి, ఏజిఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, ఏరియా వర్క్ షాప్ ఇంజనీర్ అనిల్, పర్సనల్ మేనేజర్ బి.శివ కేశవరావుతో ప్రగతి వనంలో జరుగు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19వ తారీఖున జరుగు ఫ్యామిలీ డే, బతుకమ్మ సెలబ్రేషన్‌లకు జరుగు పనులను సంబంధిత అధికారులతో పర్యవేక్షించారు. త్వరితగతిన పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రుద్రంపూర్, గౌతమ్‌పూర్, రామవరం పరిసర ప్రాంతలలో ఉంటున్న ప్రజలు 19వ తారీఖున ప్రగతి వనంలో జరుగు బతుకమ్మ సెలబ్రేషన్లలో వారు బతుకమ్మలను పేర్కొచ్చి బతుకమ్మ ఆటలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివై.ఎస్.ఈ (సివిల్) అచ్యుతరామయ్య సీనియర్ పిఓ మజ్జి. మురళి, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ సిహెచ్ సాగర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.





## రూ.6లక్షల నగదు సీజ్

**చుంచుపల్లి, అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

చుంచుపల్లి మండలంలో ఎస్సై జి.ప్రవీణ్ కుమార్ తమ సిబ్బందితో కలసి సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా ఓ ద్విచక్ర వాహనదారుని వద్ద 6 లక్షల రూపాయలు పట్టు పడింది. ఎన్నికల నియమావళి ప్రకారం వాహన దారుని వద్ద ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్టు ఎస్సై ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని, రూ.50వేల కంటే అధికంగా నగదు కలిగి ఉంటే అందుకు తగిన ధ్రువపత్రాలు చూపించాలని చుంచుపల్లి ఎస్సై జి.ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**కొత్తగూడెం, అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**



తెలంగాణ రాష్ట్రంలో, కొత్తగూడెం నియోజికవర్గంలో కాంగ్రెస్ గెలుస్తుందని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ఆశాభావం వ్యక్తంచేశారు. దీనికోసం కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలకి ఏ ఇబ్బంది వచ్చిన అధిష్టానం పార్టీ నాయకులు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 పథకాలు బిఆర్ఎస్ పార్టీ వెన్నులో వణుకు తెప్పిస్తుందని ఆ పార్టీ నాయకుడు కేసీఆర్ ఏ మాత్రం సిగ్గుపడకుండా కాంగ్రెస్ పథకాలను మార్చుకొని బిఆర్ఎస్ మ్యానిఫెస్టో అంటూ ప్రకటించడం చూస్తుంటే అధికార పార్టీలో ఓటమి భయం స్పష్టంగా కనపడుతుందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయని కేసీఆర్ ఇప్పుడు కొత్తగా ఇచ్చిన హామీలు ఇవ్వడం చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని నాగా సీతారాములు విమర్శించారు.

# ఎడవల్లికి టికెట్ కేటాయించాలి

- అధిష్ఠానం ఆదేశాలు ఇవ్వకుంటే ఆత్మహత్యకు వెనుకాడబోను..
- సెల్ టవర్ ఎక్కిన యువకుడు
- సముదాయించి కిందికి దింపిన ఎడవల్లి వర్గీయులు

**కొత్తగూడెం అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

సీపీఐకి కాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణకు కొత్తగూడెం టికెట్‌ను కేటాయించాలని సోమవారం సాయంత్రం ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. రామవరం ప్రాంతానికి రాజేంద్రకుమార్ లోథ్ అనే యువకుడు పోస్టాఫీసు సెంటర్‌లోని సెల్‌టవర్ ఎక్కి హంగామా చేశాడు. ఎడవల్లికే టికెట్ కేటాయించాలని లేకుంటే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడబోనని తెలిపాడు. దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న వన్ టౌన్ సీఐ కరుణాకర్ యువకుడితో మాట్లాడి కిందకి దింపే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఎడవల్లి అనుచరులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బి బ్లాక్ అధ్యక్షులు రాయల శాంతయ్య, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ బొమ్మిడి మల్లిఖార్జున్, పాల్వంచ టౌన్ అధ్యక్షులు నూకల రంగారావు, ఏలూరి రాజేష్ తదితరులు రాజేంద్రకుమార్‌తో మాట్లాడి ఎడవల్లికే టికెట్ వస్తుందని.. అధైర్యపడాల్సిన అవసరం లేదని సముదాయించడంతో ఎట్టకేలకూ అక్కడి నుంచి కిందకు దిగాడు. అతన్ని వెంటనే వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.







# ఎన్నికల సమరభేరిని మోగించిన వనమా

- పాల్వంచ మండలం రంగాపురం గ్రామంలో ఆరంభం
- బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఆశీర్వదించండి
- బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు
- పాత పాల్వంచ వెంకటేశ్వర స్వామి గుడి, పాల్వంచ పెద్దమ్మ తల్లి గుడిలో పూజలు

**కొత్తగూడెం, అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

పాల్వంచ మండలం రంగాపురం గ్రామంలో ఎన్నికల సమరభేరిని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు మోగించారు. తన ఇష్ట దైవమైన పాత పాల్వంచ వెంకటేశ్వర స్వామి దేవాలయం, పాల్వంచ పెద్దమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేసి, దేవుడి ఆశీర్వాదం తీసుకొని పాల్వంచ మండలం రంగపురం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఆశీర్వదించాలని కోరారు. కారు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించ ప్రార్థించారు. ఎన్నికల ప్రచార సభకు డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా వనమా రాఘవేంద్రరావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కిలారు నాగేశ్వరరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు బరపటి వాసుదేవరావు, ఎంపీపీలు మడివి సరస్వతి, బాదావత్ శాంతి, పెద్దమ్మ గుడి చైర్మన్ మహిపతి రామలింగం, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్ కనకాల నారాయణరావు, బీఆర్ఎస్ పట్టణ మండల అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, పూసల విశ్వనాథం, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు,ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, డైరెక్టర్ కాల్వ ప్రకాశరావు, బీఆర్ఎస్ నాయకులు కనగాల బాలకృష్ణ, దాసరి నాగేశ్వరరావు,ముత్యాల వీరభద్ర రావు, చల్లగుండ్ల వీరభద్రం,పెద్దమ్మ గుడి డైరెక్టర్లు ముత్యాల ప్రవీణ్,కాటారపు లక్ష్మీనారాయణ, బేతంశెట్టి విజయ్, గంధం వెంగళరావు, పాయం పాపయ్య, నాయకులు వీర్రాజు, నాగారం ఉపసర్పంచ్ చందు, కాసుల వెంకట్, అన్వర్ పాషా, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







## డైరెక్టర్ పాను పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు

**కొత్తగూడెం, అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

సింగరేణి డైరెక్టర్ పా డాక్టర్ బలరాం నాయక్ ఐఆర్ఎస్ తండ్రి హనుమంతు నాయక్ ఇటీవల మృతి చెందారు. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సింగరేణి డైరెక్టర్ పా డాక్టర్ బలరాం నాయక్ ఐఆర్ఎస్‌ను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. హనుమంతు నాయక్ మృతికి చింతిస్తూ.. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుని అండదండలు ఉండాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ పా బలరాం నాయక్ తండ్రి హనుమంతు నాయక్ వారి సొంత గ్రామంలో దహన సంస్కరణ కార్యక్రమంలో పాల్గొని డైరెక్టర్ పాను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఐఆర్ అండ్ పిఎం రిటైర్డ్ జిఎం అందెల ఆనందరావు, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల జనరల్ సెక్రెటరీ నాగేశ్వరరావు, ఎస్టీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ భూక్యా నాగేశ్వరరావు, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఆంగోత్ భాస్కరరావు, బీసీ సంఘం నాయకులు సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## వనమాను కలిసిన కంచర్ల, కాపు సీతాలక్ష్మి

**కొత్తగూడెం అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం టిఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుని పాల్వంచ వారి స్వగృహంలో సోమవారం జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతామాలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసిన కలిశారు. ఎన్నికల బరిలో సమర శంఖాన్ని పూరించనున్న సందర్భంగా వనమా వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, సుజాతనగర్ మండల అధ్యక్షులు రెడ్డి తులసి రెడ్డి, శివాలయం చైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి, లింగం సత్యనారాయణ రెడ్డి, అన్నపరెడ్డి బాల్ రెడ్డి, గురవా రెడ్డి, నరసింహ సాగర్ సర్పంచ్ అత్తిరం తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ చిగురుపాటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపన

**హైదరాబాద్, అక్టోబర్16(కెరటం ప్రతినిధి)**

ఫార్మాస్యూటికల్ కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా, చండీగఢ్ (మొహాలి) లో గల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐపీఈఆర్) భాగస్వామ్యంతో డాక్టర్ చిగురుపాటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపనకు ఆదివారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఈ భాగస్వామ్యంతో ఔషధ పరిశోధన, అభివృద్ధిలో స్థిరత్వం, ఆవిష్కరణలు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్లాంట్ ఆధారిత ఎక్సిపియెంట్‌లను అన్వేషించడం, పాలిమర్ రహిత ఔషధ సూత్రీకరణలలో పురోగతి, కంప్రెసిబుల్ స్ఫటికాలను ఉత్పత్తి చేయడంలో వినూత్న పద్ధతులు, ద్రావకం లేని ఔషధ ప్రక్రియలను ప్రోత్సహించడం, వనరులు, శక్తి, అభివృద్ధి తదితర కీలక రంగాలపై దృష్టి సారించనుంది.

ఈ భాగస్వామ్యంతో పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య జ్ఞానాన్ని విస్తరిస్తూ ఉమ్మడి పరిశోధనలు చేపట్టనున్నారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ పరిశోధనా కేంద్రం స్థాపించనుంది. నిరంతర కార్యకలాపాలకు వీలుగా సపోర్ట్ చేస్తుంది. ఆవిష్కరణతో కూడిన ఔషధాల అభివృద్ధికి, పరిశోధనలను సులభతరం చేయడానికి ఎన్ఐపీ ఈఆర్ క్యాంపస్‌లో అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశోధనా సౌకర్యాల స్థాపన ఈ భాగస్వామ్యంలో ఉంది. ఈ భాగస్వామ్యం ఫార్మాస్యూటికల్లో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది.